# కలసి వచ్చిన కాలం

రచన:
శ్రీ కలగర్ల నీలకంఠేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

'వనజా! పదండి. ఇంకో షాపుకి పోదాం' అంటూ శ్యామల ముందు దారి తీయటంతో అందరూ వెళ్ళిపోయారు.

షాపు యజమాని రాఘవయ్య తృప్తిగా ఊపిరి పీల్చుకొని 'హమ్మయ్య! గండం గడచింది. శ్రీధర్! బిల్లు రాయమంటావా?' అన్నాడు.

'రాయండి.' అన్నాడు శ్రీధర్ నిట్టూర్చుతూ.

సొమ్ము చెల్లించి నౌకరు ఇచ్చిన పేకెట్టుతో బయటకువచ్చి కారులో కూర్చున్నాం. శ్రీధర్ కారు స్టార్టు చేశాడు. డ్రైవు చేస్తున్నాడే కాని అతని మనస్సు ఎక్కడో వుందని గ్రహించేను.

'అన్నయ్యా' అని పిలచాను.

జవాబు లేదు. 'నిన్నే' అంటూ భుజంమీద తట్టాను.

'అబ్బా! ఏమిటమ్మా?' అన్నాడు విసుగుతో.

'శ్యామల కనిపించిందిగా.' అన్నాను.

'అయితే.'

'క్షమార్పణ చెప్పుకోలేదేం?' శ్రీధర్ ముఖంలోకి చూసాను.

'దేనికేనా కాలం కలసి రావాలి చెల్లెమ్మా!' అన్నాడు.

'అన్నయ్యా! శ్యామల చాలా బావుంటుంది కదూ.' అన్నాను.

'పెళ్లిచేసుకొంటావా?' అన్నాడు శ్రీధర్.

'ఛీ! నే నెలా చేసుకుంటాను. నువ్వు చేసుకుంటే..'

'ధంసావు వో! ఆ అమ్మాయిని చేసుకుంటే, రోజూ మీరిద్దరూ చీరల కోసం తగవులాడటం నేను చూడాలి.' అన్నాడు శ్రీధర్.

'మాట వరసకన్నానులే. ఆకలేస్తుంది. కారు త్వరగా పోనీ.' అన్నాను.

శ్రీధర్ నవ్వుతూ ఆక్సిలేటరు బలంగా నొక్కాడు.

\+ + +

యాంత్రికంగా రోజులు గడచిపోతున్నాయి. ఒకనాడు శ్రీధర్ స్నేహితుడు సారధి పెళ్ళికి మా కాహ్వానం వచ్చింది. పెళ్లిరోజున నేనూ శ్రీధర్ కలసి వెళ్ళేం. స్వర్గంలా అలంకరింపబడిన పెళ్ళిపందిరి, ఎటుచూసినా రంగు, రంగుల విద్యుత్ దీపాలు కళ్లు జిగేల్ మనిపిస్తున్నాయి. నాదస్వర వాద్యం చెవులకు హాయినిస్తుంది. ఇసుక వేస్తే రాలనంత జనంతో పెళ్లి పందిరి నిండివుంది. అందరూ ఎవరి హడావుడిలో వాళ్లున్నారు. నన్ను లోపలికి పోయి సారథి తల్లికి ఏదేనా సహాయం కావలిస్తే చేయమని చెప్పి శ్రీధర్ మొగవారు కూర్చొన్న వేపు వెళ్లారు లోపలకు వెళ్ళేను. సారథి తల్లి కామాక్షమ్మ నన్ను చూసి 'వసుంధరా! వచ్చావా? అమ్మగారు రాలేదా?' అని అడిగింది.

'లేదు అమ్మకు బోలెడంత పని. తీరికే వుండదు.' అన్నాను.

ఇంతలో ఒక అమ్మాయి పరిగెత్తుతూ మావద్దకువచ్చి కామాక్షమ్మతో 'అత్తయ్యా! ఆడవారికి పంచటానికి పేకెట్లు కావాలి.' అన్నది.

వసుంధరా! లోపలిగదిలో పేకెట్లు కడుతున్నారు. తెచ్చి ఈమెకు కాస్త ఇవ్వు తల్లీ, నాకు తీరికే లేదు.! అంటూ కామాక్షమ్మ వేరే వేపు వెళ్ళింది.

గదిలోనికి ప్యాకెట్లకోసం వెళ్ళాను. నాకళ్లను నేనే నమ్మలేకపోయాను. గదిలో కూర్చొని పేకెట్లు కడుతున్నది శ్యామల.

'చూడండి.' అన్నాను.

శ్యామల తలెత్తి నావేపు చూసి 'ఏం కావాలి?' అన్నది.

'ఆడవారికి పంచటానికి పేకెట్లు. అన్నాను.

పళ్లెం నిండుగా పేకెట్లు నాచేతికిస్తూ 'ఇవి వారికి ఇచ్చి, వెంటనే నువ్విక్కడకు రా.' అన్నది శ్యామల.

పేకెట్లు ఇచ్చివేసి తిరిగివచ్చాను.

'చూడు వసుంధరా! ఒక్కర్తినే పేకెట్లు కట్టలేక విసిగి ఛస్తున్నాను. నువ్వు కాస్త సహాయం చేద్దూ ప్లీజ్.' అన్నది శ్యామల. శ్యామలా నేనూ చెరొక వేపు కూర్చొని పేకెట్లు కడుతున్నాం.

'నామీద మీకు కోపం గదూ?' అంటూ శ్యామల వేపుచూసాను.

'లేదే!' అన్నది శ్యామల ఆశ్చర్యంతో.

'మరి ఆనాడు బట్టల షాపులో......'

'వసుంధరా! జరిగినదంతా ఒక పీడ కలలామరచిపోలేతిసిందా?' అన్నది శ్యామల.

'సారధిగారు మీకేమేనా బంధువులా?' వక్కపొడి పొట్లాం పేకెట్లో వేస్తూ అడిగింది శ్యామల.

'కాదు. మా అన్నయ్యకు స్నేహితుడు.' అన్నాను.

'ఒక్కర్తివేనా వచ్చావు?'

'లేదు. అన్నయ్యకూడ వచ్చాడు.'

'ఏరి?' శ్యామల ప్రశ్నలో కాస్త ఆతృత కనిపించింది.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

'వున్నాడు. రమ్మని చెప్పనా?' శ్యామలవేపు చూసి నవ్వాను.

'అబ్బే! ఇక్కడి కెందుకూ? ఊరకనే అడిగాను. అంతే.' తడబాటును కప్పిపుచ్చ ప్రయత్నించింది శ్యామల.

గంట తరువాత పేకెట్ల పని పూర్తయింది.

'ఇక చాలు వసుందరా! పందిట్లోకి వెళదాం పద.' అన్నది శ్యామల.

ఇద్దరం కలసి పందిట్లోకి వచ్చాం సూత్రధారకం అప్పుడే జరుగుతుంది. పచ్చని పసుపు బట్టలలో నున్న సారధి, పెళ్ళికూతురు మెడలో మాంగల్యం కడుతున్నారు. శ్యామలనా జడ లాగుతూ, 'వసూ! నీ మెడలో ఎప్పుడు అలా పుస్తె పడుతుందో?' అన్నది.

'కాదు. ముందు నీ మెడలో పడుతుంది.' అంటూ నవ్వాను.

'మీ అన్నయ్య ఎక్కడా?' నలువైపులా చూస్తూ అన్నది శ్యామల.

కనబడటంలేదూ. అదిగో. కల్యాణ మండపం ప్రక్కనే. చేతిలో కెమేరాతో నిల్చున్నాడు.'అన్నాను శ్రీధర్‌ను చూపుతూ.

పెళ్ళితంతు అంతా పూర్తయింది. వచ్చినవారంతా వెళ్ళేరు. శ్రీధర్ నావద్దకువచ్చి 'వసూ! ఇక వెళదామా?' అన్నాడు.

'అదేమిటి శ్రీధర్? భోజనంచేసి వెళుదురుగాని కాస్త ఆగండి.' అన్నది కామాక్షమ్మ.

'లేదండీ. ఇంట్లో అమ్మ ఒక్కర్తె వున్నది. నాన్నగారు కూడా ఊళ్ళోలేరు. మేం త్వరగా వెళ్లాలి.' అన్నాను.

'అదేం కుదరదు. ఇంతావచ్చి భోజనమేనా చేయకుండా వెళతారా? కాసింత ఓపిక పట్టండి. అయిదు నిముషాల్లో వడ్డించుతారు.' అన్నది కామాక్షమ్మ. ఇక ఒప్పుకోక తప్పుతుందా?

భోజనాలు పూర్తయినాయి. ఇంటికి వెళ్లటానికి శ్రీధర్ నేను బయలుదేరాం. కామాక్షమ్మగారు శ్యామలను తీసుకొచ్చి శ్రీధర్‌తో 'చూడు బాబూ! కారు డ్రైవరు బజారుకు పనుపడి వెళ్ళాడు. కాస్త ఈ అమ్మాయిని వారి ఇంటివద్ద దింపివేద్దూ. మీ ఇంటికి వెళ్లే దారిలోనే వీళ్ల ఇల్లు.' అన్నది.

'మా కారులోనా?' ఆశ్చర్యంతో అన్నాడు శ్రీధర్.

కామాక్షమ్మ నవ్వుతూ 'నీ అనుమానం నాకు తెలుసులే. ఏం బాధలేదు. వసుందర వుందిగా' అన్నది.

'వసుందర వున్నది కానీ......'

'మరేం ఫర్వాలేదు. పాపం; ఆడపిల్ల ఒంటరిగా ఇంత రాత్రివేళ ఎలా వెళుతుంది?'

'మా శ్రీధర్ మాటలకేం లెండి శ్యామలను వాళ్ల ఇంటివద్ద దింపే పూచీనాది. సరేనా.' అన్నాను.

'వసుంధరా...' అంటూ శ్రీధర్ అడ్డు చెప్పబోయాడు.

'నోమోర్ డిస్కషన్ ప్లీజ్.' అన్నాను.

చివరకు శ్రీధర్ ఒప్పుకోక తప్పలేదు. కామాక్షమ్మ మమ్మల్ని కారుదాకా సాగనంపుతూ 'వసుంధరా! రేపు సత్యనారాయణ వ్రతం. మీ అమ్మగారిని తీసుకురా.' అన్నది.

డ్రైవింగ్ సీట్లో శ్రీధర్ కూర్చున్నాడు. నేనూ, శ్యామలా వెనుక సీట్లో కూర్చున్నాం.

'ఇక కదలించు నీరధాన్ని.' అన్నాను శ్రీధర్‌తో.

శ్రీధర్ కారు స్టార్టు చేసాడు. బయటనుండి చల్లని గాలి వీస్తుంది. విండోగ్లాసులు మూసివేసాను. శ్రీధర్ ప్రవర్తన చూసి నామీద కోపంవచ్చినట్టు గ్రహించాను. శ్యామలగూడా మౌనంగానే కూర్చుంది. శ్రీధర్ అద్దంనుండి శ్యామలపై దృష్టి నిలపటం చూసాను.

'అన్నయ్యా! అద్దంనుండి నీ దృష్టి మరల్చు లేకపోతే ప్రమాదం.' అన్నాను.

శ్రీధర్ వద్దనుండి సమాధానం లేదు:

'శ్యామలా! మాట్లాడకుండా అలా ముంగిలా కూర్చున్నారేం?' అన్నాను.

శ్యామల నవ్వుతూ 'ఏం మాట్లాడ మంటావు?' అన్నది.

'అబ్బా! ఏదేనా మాట్లాడుదురూ. మా అన్నయ్యకు నామీద కోపంవచ్చింది. మీరేనా మాట్లాడుదురూ లేకపోతే బోర్ కొడుతుంది. మీరేం చదువుకున్నారు?' అన్నాను.

'ఏదో లే. నీ అంత గొప్పగా చదువుకోలేదు.'

'అడిగిన దానికి సూటిగా సమాధానం చెబితేగాని వదలను.' అన్నాను.

'మెట్రిక్ పాసయ్యాను.' అన్నది శ్యామల.

'గుడ్. అన్నయ్యా! శ్యామల మెట్రిక్ పాసయిందట.' అన్నాను శ్రీధర్ భుజం తట్టుతూ.

'షటప్.' అంటూ శ్రీధర్ నాచేతిని విసిరికొట్టాడు.

'ఊరుకో.' అన్నట్టు సౌంజ్ఞ చేసింది శ్యామల.

'అదికాదు శ్యామలా మా అన్నయ్య ఉద్దేశం ప్రకారం, ఆడపిల్లల క్వాలిపికేషను మెట్రిక్ వరకే. అదిదాటితే వారికి కళ్ళునెత్తిమీద కొస్తాయట.'

'అలాగా!'

'మరేమిటి అనుకున్నావు. రోజూ నన్ను ఏడిపించుకు తింటాడు. కాలేజీ చదువుతున్నానని.'

'నువ్వేం చదువుతున్నావు వసుంధరా!' అన్నది శ్యామల.

'పటయర్ బి. ఎస్. సి.' అన్నాను.

'మరి మీ అన్నయ్య.' చెవిలో రహస్యంగా అన్నది శ్యామల.

'మా అన్నయ్య సంగతా? మెట్రిక్ నాలుగుసార్లు తప్పాడు. ప్రస్తుతం ఇంట్లో కూర్చున్నాడు.' అంటూ శ్రీధర్ వేపు చూసాను. ముసి ముసిగా నవ్వుకుంటు న్నాడు.

'వసుంధరా! అదిగో మా ఇల్లు' అన్నది శ్యామల.

'సరే! కారు ఆపివేయమంటాను. శ్రీధర్ గారూ! మీ సారథ్యం కాస్త ఆపి రథాన్ని నిలపండి. శ్యామల ఇల్లు వచ్చింది.' అన్నాను.

శ్రీధర్ కా రాపాడు. శ్యామల కారుదిగుతూ 'వసుంధరా! మెనీ, మెనీ థాంక్స్.' అన్నది.

'అది చెప్పవలసినది నాకు గాదు. అదిగో.' అంటూ శ్రీధర్‌ను చూపాను.

'ఊహూ! నువ్వే చెప్పు.'

'బాగుంది. మా కారులో వచ్చి నేను శ్రీధర్‌కి థాంక్స చెప్పటమా? ఏం ఫర్వాలేదు. చెబుదూ.'

శ్యామల శ్రీధర్ వద్దకు వెళ్ళింది. తలవంచుకొని, 'చాలా థాంక్స్, శ్రమ తీసుకొని మా ఇంటిదాకా దిగ బెట్టారు.' అన్నది.

'కారులో వచ్చావుగా, ఇందులో అన్నయ్య శ్రమేముంది.' అన్నాను.

'ఫర్వాలేదు లెండి.' అన్నాడు శ్రీధర్ శ్యామలతో.

'ఆమె థాంక్స చెప్పింది. నువ్వు 'నో మెన్షన్'అనాలి, తెలిసిందా?' అని శ్రీధర్‌ను చూసాను.

'వసుందరా! మా ఇంటికి రండి. కాఫీ త్రాగి వెళుదురుగాని.' అన్నది శ్యామల.

'నా మొహం. ఇప్పుడేం కాఫీ? చాలా రాత్రయింది. ఇంకోసారి వచ్చి త్రాగుతాం సరేనా?' అన్నాను.

'సరే! గుడ్ నైట్ టు బోత్ అవ్ యు.' అన్నది శ్యామల.

'గుడ్ నైట్! అన్నయ్యా! శ్యామల నీకు గూడ గుడ్ నైట్ చెప్పింది విన్నావా?'

'నోటికి కాస్త తాళం వెయ్యగూడదూ.' అన్నాడు శ్రీధర్ కోపంతో.

'శ్యామలా! ప్రస్థుతం శ్రీధర్ ఫైర్ మూడ్‌లో ఉన్నాడు. ఆయన తరపున నీకు నేను గుడ్ నైట్ చెబుతున్నాను.'అన్నాను.

'సోదరీ! ఇకనైన గృహమ్మునకు దారి తీయుదమా?' అన్నాడు శ్రీధర్ వెటకారంగా.

'వెళ్ళొస్తాను శ్యామలా.' అంటూ కారులోకి వచ్చి కూర్చున్నాను.

'గృహమ్మునకు దారి తీయుము సోదరా!' అన్నాను. శ్రీధర్ తిరిగి కారుస్టార్టు చేసాడు.

'అన్నయ్యా! కోపం వచ్చిందా?' అన్నాను.

'ఎందుకు?' నవ్వుతూ అన్నాడు శ్రీధర్.

'శ్యామలతో నీగురించి అబద్ధమాడేనుగా,'అన్నాను.

'నాకేం కోపం లేదులే.'

'మరి ఆమె ఉన్నంసేపూ ఎందుకలా కోపంగా ఉన్నావు.'

'అదా? నటన.'

'మన కారులో శ్యామల వస్తానంటే ఎందుకు వద్దన్నావు?' అన్నాను.

'అదా! ఎంతైనా పరాయివాళ్ల అమ్మాయి గదా.' కారు స్పీడు హెచ్చిస్తూ అన్నాడు శ్రీధర్.

'మరి శ్యామలకు క్షమార్పణ చెప్పవేలేదేం?'

'దేనికి?'

'ఆనాడు నువ్వు చేసిన పనికి.'

'చెప్పానుగా. కాలం కలసిరావాలి.' అన్నాడు శ్రీధర్.

'అదే అడుగుతున్నాను. ఎప్పుడు వస్తుంది.'

'వచ్చేటప్పుడు చెబుతానుగా. ఇక నోరు మూసుకో.' అన్నాడు శ్రీధర్ కోపంతో.

'కాలం కలసి రావాలి' అన్న శ్రీధర్ మాటలలోని అంతర్యం నాకు ఎంత ఆలోచించినా బోధపడలేదు.

\+ \+ \+

మర్నాడు సారధిగారింట్లో సత్యనారాయణ వ్రతానికి నేనూ అమ్మ కలసి వెళ్ళాం. గుమ్మంలో అడుగు పెడుతునే శ్యామల కనిపించింది.

'వసూ! ఆనాడు మన ఇంటికి వచ్చింది ఈ అమ్మాయే కదూ?' అంటూ మా అమ్మ శ్యామలను చూసి ఆశ్చర్యపోయింది.

'ఔనమ్మా. ఈ అమ్మాయే మనింటికి వచ్చి కన్నుబుస్సుమంది.' అన్నాను శ్యామల వేపు చూస్తూ.

'నీ పేరేమిటమ్మా? కామాక్షమ్మగారు నీకేమౌతారు.' అంటూ మా అమ్మ ప్రశ్నలవర్షం కురిపించింది.

(సశేషం)